మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

11.4.2026 శనివారం Saturday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 351 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


## వండర్‌కిడ్ వైభవ్ వీరవిహారం






## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై
# కాంగ్రెస్ ఫోకస్
### మహిళా బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై చర్చ

- ఈ రెండు అంశాలపై కాంగ్రెస్ సుదీర్ఘ కసరత్తు
- రాజకీయ లబ్దికోసంమే ప్రత్యేక సమావేశాలన్న ఖర్గే
- తెలంగాణలో డీలిమిటేషన్‌నూ రేవంత్ నివేదిక సమర్పణ

**జనతా న్యూస్, న్యూఢిల్లీ :** జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సమాలోచనలు చేసింది. ముఖ్యంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహిళా బిల్లు, సీట్లు పెంపుదల వంటి రెండు అంశాలపై వ్యూహాత్మకంగా ఉండాలని నిర్ణయించారు. దేశ రాజధాని ఢిల్లీ ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు

మిగతా 2 లో



# అన్నా.. నన్ను దేవుడే పంపిండు...
### మీతో కలిసి పని చేయమని చెప్పిండు
### ఎర్రవల్లిలో కేసీఆర్‌తో జీవన్‌రెడ్డి భేటీ
ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలకించిన కేసీఆర్



బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. 'అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

03

## తిరోగమనంలో కాంగ్రెస్ పార్టీ
- తెలంగాణపై పట్టు కోల్పోయిన అధిష్ఠానం
- రేవంత్ చెప్పు చేతల్లో పిసిసి బంది
- పదవుల కోసం అయితే అధికార పార్టీ వీడుతానా
- మీడియాతో జీవన్ రెడ్డి వెల్లడి

03



## తదుపరి డీజీపీగా సివి ఆనంద్?
ప్రభుత్వ పరిశీలనలో ఆయన పేరు

.. వివరాలు 2లో




## రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం
ప్రమాణం చేయించిన ఉప రాష్ట్రపతి, రాజ్యసభ

.. వివరాలు 4లో

## కాలిన నోట్ల కట్టల వ్యవహారం
పదవికి రాజీనామా చేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ

.. వివరాలు 4లో

# నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు



03

### నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన
### భారీగా బందోబస్తు ఏర్పాటు

అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు
### ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో

- గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా
- కేవలం కమిషన్ల కోసమేనేమో అన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం
- జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు.

03



## పేదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం

- వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం
- సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసినా భవిష్యత్తు లో ఇందిరమ్మ ప్రభుత్వంని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

వివరాలు 2 లో..

## డీజీపీ ఎదుట లొంగిపోయిన కేశాలు

- మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు
- వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి

తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు.

02



# తదుపరి డీజీపీగా సివి ఆనంద్?

## ప్రభుత్వ పరిశీలనలో ఆయన పేరు



**హైదరాబాద్,ఏప్రిల్10 :** తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1991వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ తెలంగాణ రాష్ట్ర తదుపరి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఇన్-చార్జ్ డీజీపీగా కొనసాగుతున్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో, ఆ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కొత్త అధికారిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నియామకం కోసం రాష్ట్రం పంపిన ఐదుగురు అధికారుల జాబితాను పరిశీలించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , ముగ్గురు అధికారులతో కూడిన ప్యానెల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఆ జాబితాలో సి.వి. ఆనంద్‌తో పాటు కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్‌గా ఉన్న వినాయక ప్రభాకర్ ఆప్టే , తెలంగాణ జైళ్ల శాఖ డీజీగా ఉన్న సౌమ్య మిశ్రాల పేర్లు ఉన్నాయి. అయితే, ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పేరు ఈ సిఫార్సు జాబితాలో లేకపోవడంతో ఆయన పదవీ విరమణ అనివార్యం కాగా, సీనియారిటీ , రాష్ట్రంలో సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా సి.వి. ఆనంద్ పేరుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు డీజీపీ పదవికి ఆయన పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల అవకాశం దక్కలేదు, కానీ ఈసారి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఆయన నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఈ నెల 14వ తేదీ తర్వాత వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవేళ సి.వి. ఆనంద్ బాధ్యతలు చేపడితే, ఆయన పదవీ కాలం 2028 మే వరకు ఉంటుంది. మరోవైపు, మహిళా అధికారులకు కూడా ప్రాధాన్యత ఇస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఒక మహిళా డీజీ స్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఏప్రిల్ 13 నాటికి డీజీపీ నియామకంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో, త్వరలోనే రాష్ట్ర పోలీస్ శాఖలో ఈ కీలక మార్పు చోటుచేసుకోనుంది.

# ఐటి కారిడార్‌లో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

## అదుపుతప్పి పోలీస్ల ఔట్‌పోస్టును ఢీకొన్న కారు

## కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్,ఏప్రిల్10 :** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మసీద్ బండ నుంచి కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఓ కారు అదుపు తప్పి ట్రాఫిక్ అవుట్‌పోస్టును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం కూడా తీవ్రంగా దెబ్బతింది. కారు ఇంజిన్ భాగం లోపలికి చొచ్చుకు పోయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది.సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపే అవకాశం ఉంది. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సీసీటీవీ ఫుటేజీని కూడా పరిశీలిస్తున్నారు. ఐటీ కారిడార్ పరిధిలో అర్ధరాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉన్నాయని అతివేగంగా వెళ్లడం ప్రమాదాలకు దారితీస్తోందని పోలీసులు తెలిపారు. గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో పోలీసులు ఎన్ని తనిఖీలు చేస్తున్నా ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. వేగం కంటే ప్రాణం ముఖ్యమని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు సూచించారు.

# ఆటోలో యువకుడి మృతదేహం

## ఉరేసుకున్నట్లుగా రాడ్‌కు శవం

## తమ కొడుకును హత్య చేశారని కుటుంబీకుల ఆరోపణ

## అనుమానాస్పద మృతిగా పోలీసుల దర్యాప్తు

**సూర్యాపేట, ఏప్రిల్10 :** సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికంగా కలకలం రేపింది. రత్నావత్ మణి భార్గవ్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం సమయంలో అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఆటోలో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సూర్యాపేట జిల్లా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని చివ్వెంల మండలం ఎంజీనగర్ తండా శివారులో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోలో ఓ యువకుడు విగతజీవిగా కనిపించడం కలకలం రేపింది. మృతుడిని రత్నావత్ మణి భార్గవ్‌గా గుర్తించారు. మృతుడు ఆటోలో ఉన్న ఇనుప రాడ్డుకు వేలాడుతూ కనిపించాడు. ఈ ఘటనపై ప్రస్తుతం సోషల్ మీడియా, స్థానికుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇది ఆత్మహత్యా లేక ఎవరైనా చంపి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారా? అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మణి భార్గవ్‌కు ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా? లేదా కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించడానికి క్లూస్ టీమ్‌ను పోలీసులు రంగంలోకి దించినట్లు సమాచారం. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వస్తేనే మరణానికి గల అసలు కారణాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. మణి భార్గవ్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు, అతను చివరిగా ఎవరితో మాట్లాడారు?, ఎవరితోనైనా ఛాటింగ్ చేశారా? అనే కాల్ డేటా రికార్డులను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. మణి భార్గవ్ మరణ వార్త విన్న అతని తండా, కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తమ కొడుకుది ఆత్మహత్య కాదని, దీని వెనుక ఏదో కుట్ర ఉందని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# హెచ్‌ఐవి రక్తం ఎక్కించిన ఘటన

## ఆత్మహత్య చేసుకున్న యువతి

**హైదరాబాద్,ఏప్రిల్10 :** ప్రేమించిన అమ్మాయికి హెచ్‌ఐవీ రక్తం ఎక్కించిన ఘటనలో సదరు యువతి రమణి(23) ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మేడ్చల్ జిల్లా అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలోని తమ ఇంట్లో రమణి ఆత్మహత్యకు పాల్పడింది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రమణి.. ఎదులాబాద్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. అయితే, సమీప బంధువైన మనోహర్‌తో ఆమెకు నిశ్చితార్థం చేశారు కుటుంబసభ్యులు. పెళ్లికి అంతా సిద్ధమైన తర్వాత వైద్య పరీక్షల్లో అతనికి ఎయిడ్స్ ఉందని తేలింది. దీంతో యువతి కుటుంబసభ్యులు మనోహర్‌తో పెళ్లికి నిరాకరించారు. ఇది మనసులో పెట్టుకున్న నిందితుడు తనను వివాహం చేసుకోవాలని రమణిని పలుమార్లు బలవంతం చేశాడు. ఆమె ఒప్పుకోక పోవడంతో ఈ ఏడాది మార్చి 11న ఇంట్లో యువతి ఒంటరిగా ఉన్న సమయంలో వచ్చి బలవంతంగా హెచ్‌ఐవీ రక్తాన్ని ఎక్కించాడు. అనంతరం మనోహర్ అక్కడ్నుంచి పారిపోయాడు. బాధిత యువతి విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో ఈ ఘటన సంచలనంగా మారింది. రమణి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మనోహర్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఈ ఉదంతం మొత్తాన్ని అవమానకరంగా భావించిన యువతి శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకుంది.

# పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై కాంగ్రెస్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి

మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు. 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు. కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను



దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ అచిఅ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# పేదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం



## వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం

## సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం,ఏప్రిల్10 :** ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసినా భవిష్యత్తు లో ఇందిరమ్మ ప్రభుత్వంని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 58.58 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలిన ఈ ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ధాన్యం కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ. 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని ఏడాదికి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త గా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ధరణి తో రైతులు ఇబ్బందులు పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేపంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తల్లీకూతుళ్ల హత్య కేసులో పురోగతి

## భర్తే వారిని స్విమ్మింగ్ పూల్‌లో తోసేసి హత్య

## ఆడపిల్లలు పుడుతున్నారని హత్యకు పన్నాగం

**వరంగల్,ఏప్రిల్10 :** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన తల్లీకూతుళ్ల హత్య కేసు దర్యాప్తులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో భర్తతో పాటు పదిమంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు డాక్టర్లు బాల్నె పూర్ణిమ, ఎస్.రవళి పరారీలో ఉన్నారు. ఐనవోలు మండలం పున్నేలులో ఈనెల 1న భార్య, ఇద్దరు కూతుళ్లను భర్త స్విమ్మింగ్ పూల్‌లో నెట్టేసి చంపేసిన ఘటన సంచలనం రేపింది. భార్యకు ఆడపిల్లలే పుడుతున్నారని భర్త అజారుద్దీన్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. అప్పటికే భార్య ఫరహాత్ గర్భవతి. ఫరహాత్‌కు గతంలోనూ రెండు అబార్షన్లు చేయించాడు అజారుద్దీన్. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. తల్లీకూతళ్ల హత్యకు సహకరించిన కుటుంబ సభ్యులతో పాటు లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన సిబ్బంది, అబార్షన్లు చేసిన డాక్టర్లను నిందితులుగా తేల్చారు. కొడుకే పుట్టాలన్న కోరికతో నిందితుడు అజారుద్దీన్.. భార్య, ఇద్దరు కూతుళ్లను చంపేశాడని సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అప్పటికే భార్యకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి రెండు అబార్షన్లు చేయించాడని.. మరోసారి భార్య ఫరహాత్ గర్భం దాల్చడంతో ఆమెకు మళ్లీ ఆడపిల్లే పుడుతుందన్న భయంతో చంపేసినట్లు వివరించారు. ఓ బాలికను వివాహం చేసుకోవాలని అనుకున్నాడని.. పథకం ప్రకారమే భార్య, పిల్లలను తన స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లి నీళ్లలో ముంచి చంపేసినట్లు చెప్పారు. అయితే.. అనుమానాస్పద మృతిగా నమోదైన ఈ కేసులో.. సెక్షన్లను మార్చి నిందితులకు కఠిన శిక్షపడేలా చేస్తామని తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని సిఫార్సు చేస్తామన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేసిన వారిపై గతంలోనూ కేసులున్నాయని సీపీ పేర్కొన్నారు.

# డీజీపీ ఎదుట లొంగిపోయిన కేశాలు

## మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు

## వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్10 :** తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల నుంచి వచ్చి వీరంతా లొంగిపోయారు. ములుగు, భూపాలపల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు.అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా గెరిల్లాను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్ బాధ్యతలను బడ్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు. ఆ తర్వాత బెటాలియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సోడిమల్ల కేశాలు సైతం తాజాగా శుక్రవారం లొంగిపోయారు. ఇతనికి సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ వంటి పేర్లున్నాయి. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు.మొత్తం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో గెరిల్లా బెటాలియన్ కమాండర్ సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలు,



బంగారంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 36 తుపాకులు, ఐదు ఏకే 47లు, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 1,007 తూటాలతో పోలీసులు ముందు మావోలు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. అలాగే 800 గ్రాముల బంగారం సైతం అప్పగించినట్లు వెల్లడించారు. వీరి లొంగుబాటుతో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగైనట్లు డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు.గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు కూడా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందివారు కాగా.. ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. 'లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ కింద రూ.1.93 కోట్లు అందజేస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులు అందజేస్తాం. తెలంగాణకు చెందిన వాళ్లు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరున్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. వాళ్లు కూడా లొంగిపోవాలని పిలుపునిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# అన్నా.. నన్ను దేవుడే పంపిండు...

**మీతో కలిసి పని చేయమని చెప్పిండు**

**ఎర్రవల్లిలో కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ**

**ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలకరించిన కేసీఆర్**



**గజ్వేల్,ఏప్రిల్10 :** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. ' అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు. తాజా రాజకీయాలు, కాంగ్రెస్ తీరును ఆయన కెసిఆర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.' తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంద్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు. జీవన్ రెడ్డి కూడా కెసిఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉండి, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం, కేసీఆర్‌ను 'అన్నా' అని సంబోధిస్తూ భావోద్వేగానికి లోనవ్వడం చూస్తుంటే.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించబోతున్నాయని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఈ చేరిక ఒక పెద్ద ఊతమివ్వనుంది.



## 20న జగిత్యాలలో భారీ బహిరంగ సభ

**ముఖ్య అతిథిగా హాజరు కానున్న కెసిఆర్**

**కెసిఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పకోనున్న జీవన్**

**మాజీమంత్రులు కొప్పుల, ఎల్. రమణల వెల్లడి**

గజ్వేల్,ఏప్రిల్10(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్‌ను వీడిన టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం ఖాయమైంది. శుక్రవారం ఎర్రవల్లిలో గులాబీ అధినేత కేసీఆర్ ను కలిసిన జీవన్ రెడ్డి ఏప్రిల్ 20వ తేదీన పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరుతున్నందున జగిత్యాలలో తమ ప్రాబల్యాన్ని చాటేందుకు భారీ బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ భావిస్తోంది. ఈ సమావేశానికి ప్రత్యేక అతిథిగా రావాల్సిందిగా కేసీఆర్‌ను జీవన్ రెడ్డి ఆహ్వానించారు. కాంగ్రెస్‌తో 20 ఏళ్లకుపైగా అనుబంధాన్ని తెంచుకున్న జీవన్ రెడ్డి శుక్రవారం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. తన బృందంతో కలిసి వచ్చిన జీవన్ రెడ్డికి గులబీ బాస్ ఆత్మీయంగా ఆళింగనం చేసుకున్నారు. జీవన్ రెడ్డి బృందంతో కలిసి లంచ్ చేసిన కేసీఆర్ అనంతరం.. పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి పార్టీలో సముచిత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాలని జీవన్ రెడ్డి ఆహ్వానించగా గులాబీ అధినేత సానుకూలంగా స్పందించారని సమాచారం. బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు టి. జీవన్ రెడ్డికి ముహూర్తం ఖరారు అయింది. ఏప్రిల్ 20వ తేదీన జగిత్యాల వేదికగా బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ నిర్వహిస్తుందని ఆ పార్టీ నేత కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. ఈ సభలో బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరతారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌తో కొప్పుల ఈశ్వర్, ఎల్ రమణ సమావేశమయ్యారు. అనంతరం వీరు విలేకర్లతో మాట్లాడుతూ.. కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరతారని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు శనివారం జగిత్యాలలో స్థలాన్ని పరిశీలిస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో రైతు సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై ఈ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్లీనరీ సభకి ముందే పార్టీలో చేరికలు ఉంటాయన్నారు. కేసీఆర్‌తో కలిసి పని చేయడానికి జీవన్ రెడ్డి ముందుకు వచ్చారని చెప్పారు. పార్టీలో తగిన ప్రాధాన్యత ఇస్తామని జీవన్ రెడ్డికి కేసీఆర్ హామీ ఇచ్చారని ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ప్రజాక్షేత్రంలోకి రానున్నారని ఆ పార్టీ నేత ఎల్.రమణ వెల్లడించారు. ప్రజా సమస్యలపై ఇకపై నిరంతరంగా పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతామని ఎల్ రమణ తెలిపారు.

# తిరోగమనంలో కాంగ్రెస్ పార్టీ

**తెలంగాణపై పట్టు కోల్పోయిన అధిష్ఠానం**

**రేవంత్ చెప్ప చేతల్లో పిసిసి బందీ**

**మీడియాతో జీవన్ రెడ్డి వెల్లడి**

**గజ్వేల్,ఏప్రిల్10 :** మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అనంతరం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పట్టు కోల్పోయిందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు పీసీసీ చెప్పినట్లు సీఎం నడుచుకునేవారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిందే పీసీసీ అమలు చేస్తోందని అన్నారు. కేసీఆర్‌తో దాదాపు 5 గంటలపాటు జీవన్‌రెడ్డి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన విషయంలో పీసీసీ తప్పు చేసి.. ఆ నింద ఏఐసీసీపై వేస్తోందన్నారు. నాకు 14 సార్లు బీ ఫామ్ ఇచ్చారంటే.. అది నా సమర్థతతోనే. కాంగ్రెస్ పార్టీ తిరోగమనంలో పయనిస్తోంది. కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి అని ప్రజల్లో చర్చ మొదలైంది. త్వరలో జగిత్యాలలో సభపెట్టి బీఆర్ఎస్‌లో చేరతానని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమైన టి.జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని కడిగిపారేశారు. కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణపై పట్టు కోల్పోయిందని పేర్కొన్న ఆయన మోసపూరిత కాంగ్రెస్ పోవాలని, కేసీఆర్ మళ్లీ రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ తిరోగమనంలో పయనిస్తోందని జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌తో భేటీ అయిన జీవన్ రెడ్డి ఏప్రిల్ 20న పార్టీలో చేరుతున్నానని ప్రకటించారు. కొన్నాళ్లుగా పార్టీలో జరుగుతున్న పరిణామాలతో కలత చెందాను. అందుకే.. బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్‌తో కలిసి పని చేయాలనుకుంటున్నా. నేను అధికార పార్టీలోకి వెళ్ళట్లేదు. రెండేళ్లలో 3 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు, ఇచ్చింది 17 వేల ఉద్యోగాలు. మొదటి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు అని అన్నారు.. రెండో సంవత్సరం 1 లక్ష ఉద్యోగాలు అని అన్నారు, ఏమైంది?' అని జీవన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. పదవుల కోసమే బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాలంటే తాను ఆరోజే వెళ్ళేవాడినని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చనందుకు, ప్రజల పక్షాన పోరాడేందుకు తాను బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నానని జీవన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌తో 20 ఏళ్లకుపైగా అనుబంధాన్ని తెంచుకున్న జీవన్ రెడ్డి శుక్రవారం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. తన బృందంతో కలిసి వచ్చిన జీవన్ రెడ్డికి గులబీ బాస్ ఆత్మీయంగా ఆళింగనం చేసుకున్నారు. జీవన్ రెడ్డి బృందంతో కలిసి లంచ్ చేసిన కేసీఆర్ అనంతరం.. పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి పార్టీలో సముచిత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాలని జీవన్ రెడ్డి ఆహ్వానించగా గులాబీ అధినేత సానుకూలంగా స్పందించారని సమాచారం. అధికార పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి ఎందుకు వెళ్తున్నానో మీకే తెలియా లంటూ కాంగ్రెస్ నేతలకు చురకలు అంటించారు. మిగిలిన రెండున్నరేళ్లు అయినా కాంగ్రెస్ సర్కార్ బాగా పని చేయాలని తాను కోరుకుంటున్నట్లు జీవన్ రెడ్డి చెప్పారు.

# పదేళ్లలో తెలంగాణను ఆగం చేశారు

**ఇప్పుడేమో ఘనకార్యాలు చేసినట్లు బిల్డప్**

**హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ జూపల్లి**

**హైదరాబాద్,ఏప్రిల్10 :** గత ప్రభుత్వ నాయకులకు సరైన ఆలోచన, అవగాహన లేక రాష్ట్రానికి తీవ్ర నష్టం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. నీళు లేని చోట మాత్రం పదేళ్లలో అనేక ప్రాజెక్టులు కట్టారని విమర్శించారు. కాళేశ్వరం ఇందుకు నిదర్శనమని అన్నారు. పలమూరులో పదేళ్లుగా ఒక్క పని చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ధనిక రాష్ట్రం అప్పగిస్తే, రూ.8 లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు కాలువలకు ఇంకా అనుమతే రాలేదన్న జూపల్లి.. పాలమూరు ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తోంది మీరా? మేమా? అని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టును 80శాతం పూర్తి చేశామని అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. అబద్దాలతోనే పాలన చేశారని, ప్రజలను మోసం చేశారని అన్నారు. హరీష్



వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని హరీశ్‌రావు చెబుతున్న మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రూ.80 వేల కోట్ల అంచనా వ్యయం ఉన్న ప్రాజెక్టులో కేవలం రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు ఎలా పూర్తి చేశారని నిలదీశారు. కనీసం కాలువల నిర్మాణం పూర్తి చేయలేదని, భూసేకరణ చేపట్టలేదని, పరిపాలనా అనుమతులు కూడా లేవని విమర్శించారు. ఎన్నికల ముందు హడావుడిగా పంపులు ఆన్ చేసి ప్రజలను వంచించారు తప్ప, ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరుపై రూ. 7 వేల కోట్లు ఖర్చు చేస్తే, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు రూ. 8,300 కోట్లు వెచ్చించాయని గుర్తు చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ భూసేకరణలో భాగంగా 2.5 శాతం మంది రైతులకు మాత్రమే నష్టం వాటిల్లుతోందనని... కానీ 97.5 శాతం మంది రైతులకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

**ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో**

**మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్,ఏప్రిల్10 :** కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమిషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# అధ్వాన్నంగా ప్రభుత్వ పాఠశాలలు

**రోజుకో బిడ్డ చనిపోతున్నా చలనం లేదు**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్ఎస్‌పి విమర్శలు**

**హైదరాబాద్,ఏప్రిల్ 10 :** అసమర్థ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి వారం ఒక బిడ్డ చనిపోతుందని బీఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ప్రజల ఉసురు తీసుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి వారం ఒక ఆటో డ్రైవర్, ఆరుగురు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ప్రతి వారం 17 పాఠశాలలు మూత పడుతున్నాయి. కానీ ప్రతిరోజూ కాంగ్రెస్ పాలకులు రూ.25 కోట్లు వాళ్ల జేబుల్లో వేసుకుంటున్నారని విమర్శించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 373 ఎకరాల భూమిని నాదర్‌గుల్‌లో కబ్జా చేశారు. స్థానిక రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. అందుకే ప్రజలందరు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అవినీతి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

# ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం ఎంతో కష్టపడ్డా

**మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి**

**హైదరాబాద్,ఏప్రిల్10 :** ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం తాను ఎంతో కష్టపడ్డానని, భూమి ఇవ్వాలని రైతుల కాళ్లు మొక్కుతా అని విజ్ఞప్తి చేసినట్లు మాజీ మంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాలమూరు-రంగారెడ్డిలో భాగమైన ఏదుల రిజర్వాయర్ భూసేకరణ కోసం నేనొక్కడినే 73 సార్లు వెళ్లి రైతులను కలిశానని గుర్తు చేశారు. ప్రతిసారి వెళ్లి రైతులతో ఓపికతో కూర్చొని రైతులకు నచ్చజెప్పాను. ఒక్కో సందర్భంలో రాత్రి 10 అయ్యేది అన్నారు. వలస పోయిన పాలమూరుకు నీళ్లు వస్తే బాగు పడుద్దని, రైతులకు విజ్ఞప్తి చేసి కాళ్లు మొక్కుతానని విజ్ఞప్తి చేసి భూసేకరణ చేయించానని పేర్కొన్నారు. అంత ఓపికగా కూర్చుంటే రైతులు భూములు ఇచ్చారు. అది వదిలేసి నేను భూములు తీసుకుంటా రైతులు ఏంత? వాళ్లు కూర్చొని ఏం చేస్తారు అని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అంటే కుదరదు. ఆయన తాత వచ్చినా రైతుల భూములు లాక్కొని ప్రాజెక్ట్ కట్టలేరన్నారు. లగచర్లలో భూములు తీసుకుంటే రేవంత్ రెడ్డికే లాగులు తడిచేటట్లు చేశారు అక్కడి రైతులు. అలాగే రైతుల తరఫున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు.

# రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం

**ప్రమాణం చేయించిన ఉప రాష్ట్రపతి, రాజ్యసభ**



**న్యూఢిల్లీ :** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ–స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.

# కాలిన నోట్ల కట్టల వ్యవహారం

**పదవికి రాజీనామా చేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ**

**న్యూఢిల్లీ :** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఢిల్లీలోనితన నివాసంలో కాలిన నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన ప్రక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైన విషయం తెలిసిందే. దీంతో ఇక లాభం లేదనుకుని ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

# హరివంశ్ నారాయణ సింగ్‌కు మరో ఛాన్స్

**రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం**

**మరోమారు డిప్యూటి ఛైర్మన్ అయ్యే అవకాశం**

**న్యూఢిల్లీ :** రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువసభలో అత్యంత హుందాతనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తనకున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు. బిహార్ నుంచి జేడీయూ తరఫున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ కోటాలో సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి. హరివంశ్ నారాయణ్ సింగ్‌ను మళ్లీ సభకు పంపడం వెనుక కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను రచించిన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాల బలం గణనీయంగా ఉన్నప్పుడు, సభను సమర్థవంతంగా నడపగలిగే వ్యక్తుల అవసరం ప్రభుత్వానికి ఉంటుంది. హరివంశ్ ఆ విషయంలో ఇప్పటికే తన సత్తా చాటారు. తాజా నామినేషన్‌తో ఆయన మళ్లీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశముంది. నామినేటెడ్ సభ్యుడిగా ఉంటూ ఈ బాధ్యతలు చేపడితే, అది సభకు మరింత గౌరవాన్ని తెస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా హరివంశ్‌కున్న విలువలు, రాజకీయాలకు అతీతంగా ఆయనకు ఉన్న ఆదరణ ప్రభుత్వానికి సానుకూల అంశమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాల్లో హుందాతనం తగ్గుతున్న కాలంలో, హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి సీనియర్ల సేవలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని తెలిపారు. రంజన్ గొగొయ్ స్థానంలో ఓ అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్ రావడం సభ గౌరవాన్ని మరింత పెంచుతుందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ డిప్యూటీ ఛైర్మన్ బాధ్యతలు చేపడితే.. సభలో చర్చల నాణ్యత మరింత మెరుగుపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ముంబై ఎయిర్‌పోర్టులో 29 కిలోల బంగారం సీజ్

**కెన్యా నుంచి వస్తున్న మహిళల నుంచి స్వాధీనం**

**ముంబై:** ముంబై ఎయిర్‌పోర్ట్‌లో 29 కిలోల బంగారాన్ని డీఆర్‌ఐ అధికారులు సీజ్ చేశారు. దీని విలువ సుమారు రూ.38 కోట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. కెన్యాలోని నైరోబీ నుంచి ఈ బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. ముంబై విమానాశ్రయం లో భారీ ఎత్తున బంగారాన్ని అక్రమంగా తీసుకొస్తున్నారని డీఆర్‌ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో వెంటనే వారు అప్రమత్తమయ్యారు. ఆపరేషన్ ధహాబు పేరుతో విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కెన్యాలోని నైరోబీ నుంచి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేయగా.. బంగారం బయటపడింది. కెన్యాకు చెందిన మహిళలు దుస్తులు, బ్యాగుల్లో సుమారు 29 కిలోల బంగారాన్ని దాచినట్లు గుర్తించారు. బంగారాన్ని సీజ్ చేసిన అధికారులు.. మొత్తం 26 మంది కెన్యా దేశస్థులను అరెస్ట్ చేశారు. విమానాశ్రయంలోని గ్రీన్ ఛానల్ దాటిన తర్వాత.. అధికారులను చూసి పారిపోతుండగా.. అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పట్టుకున్న బంగారం విలువ సుమారు రూ.38 కోట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.

# నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

**నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన**


**భారీగా బందోబస్తు ఏర్పాటు**



**ఇస్లామాబాద్ :** అమెరికా–ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాల పాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్ (ఖజీతిబబిజీని).. ఇప్పుడు ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరఫున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది. ఒకవేళ చర్చలంటూ జరిగితే.. హర్మూజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్రపక్షాలపై దాడులు చేయకూడదంటూ 10 పాయింట్ల డిమాండ్ల పైనే ఇరాన్ పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక, లెబనాన్‌లోని ఇరాన్ మిత్రపక్షం హెజ్‌బొల్లా గ్రూప్‌పై ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగడం లేదు. సీజ్ఞ÷ర్ ప్రకటన తర్వాతే అక్కడ మారణహోమం సృష్టించింది. అమెరికా–ఇరాన్ మధ్య ఉన్న అపనమ్మకం, ఇజ్రాయెల్ దూకుడు కారణంగా ఈ

# వివాదంలో మోనాలిసా పెళ్లి

**పెళ్లినాటికి ఆమె మైనర్ అని గుర్తింపు.. భర్తపై ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు**



**లక్నో :** కుంభమేళాలో ఒక్క ఫోటోతో రాత్రికి రాత్రే సోషల్ మీడియా స్టార్‌గా మారిన గిరిజన యువతి మోనాలిసా ఇప్పుడు తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఆమె ప్రేమ వివాహం చట్టపరమైన సమస్యల్లో పడడంతో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన మోనాలిసా, అనంతరం ఫర్మన్ ఖాన్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. అయితే ఈ పెళ్లి చట్టబద్ధతపై అనుమానాలు వ్యక్తమవడంతో విచారణ ప్రారంభమైంది. జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టగా, అసలు విషయం మోనాలిసా మైనర్ అని తేలింది. మహేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రి రికార్డుల ప్రకారం మోనాలిసా 2009 డిసెంబర్ 30న జన్మించినట్లు తేలింది. అంటే 2026 మార్చిలో వివాహం జరిగే సమయానికి ఆమె వయస్సు కేవలం 16 సంవత్సరాలు మాత్రమే. వివాహానికి కనీస వయస్సు లేకపోవడంతో, ఆమె భర్తపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరో సంచలన అంశం కూడా బయటపడింది. పెళ్లి జరిపించేందుకు మోనాలిసా పుట్టిన తేదీని మారుస్తూ నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించినట్లు దర్యాప్తులో తేలింది. 2008లో పుట్టినట్లు చూపిస్తూ తప్పుడు సర్టిఫికెట్ల ఆధారంగా కేరళలోని ఆలయంలో వివాహం నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో కొన్ని సంస్థల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది సాధారణ ప్రేమ వివాహం కాదని, ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చేసిన చర్యగా అధికారులు పరిశీలిస్తున్నారు. కేరళ నుంచి మధ్యప్రదేశ్ వరకు విస్తరించిన ఈ కేసును విచారణ బృందం కేవలం 72 గంటల్లోనే కీలకంగా ఛేదించింది. మహేశ్వర్ మున్సిపల్ అధికారులు ఇచ్చిన పాత జనన ధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మోనాలిసా తల్లిదండ్రులు సమర్పించిన కుల ధృవీకరణ పత్రాల ద్వారా ఆమె షెడ్యూల్డ్ తెగకు చెందిన మైనర్ బాలిక అని కూడా నిర్ధారితమైంది. మైనర్ బాలికని వివాహం చేసుకున్నందుకు ఫర్మన్ ఖాన్ ప్రస్తుతం తీవ్రమైన చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో అతనిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# హైదరాబాద్-విజయవాడ మధ్య విమాన సర్వీసు

**ఫ్లై 91 విమాన సర్వీసును ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం/విజయవాడ :** హైదరాబాద్ – విజయవాడ మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. ప్రాంతీయ విమానయాన సంస్థ ఫ్లై 91 తన నూతన సర్వీసులను తెలుగు రాష్ట్రాల మధ్య అధికారికంగా ప్రారంభించింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించడంతో పాటు, సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేసే లక్ష్యంతో ఫ్లై 91 సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నూతన సర్వీసును శ్రీకాకుళం నుంచి వం-ప్చువల్‌గా పచ్చజెండా ఊపి ఈ సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. తక్కువ ధరలో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. విమాన సర్వీసును ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా టైర్–2, టైర్–3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధానమంత్రి కల నిజమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ – హైదరాబాద్ మధ్య రద్దీ దృష్ట్యా ఈ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపారవేత్తలకు వరంలా మారనుంది. ఫ్లై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. ఈ సంస్థ గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమానయాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా ప్రయాణికులకు మరిన్నిసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైదరాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసులుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయాణంపై ఒత్తిడి తగ్గనుందని భావిస్తున్నారు.

# లెబనాన్‌లపై దాడుల్లో పౌరుల మృతిపై భారత్ ఆందోళన

**దేశ ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం**

**గల్ఫ్ దేశాలతో చర్చలకు కేంద్రమంత్రులు**

**విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడి**



**న్యూఢిల్లీ :** దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని విదేశ్రాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ మేరకు ఖతార్‌తో ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు కొనసాగుతున్నాయన్నారు. అదే సమయంలో పొరుగు దేశాల ఇంధన అవసరాలనూ తీర్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు వారాల క్రితం భారత్.. శ్రీలంకకు 38 మెట్రిక్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేసినట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు దేశ ఇంధన భద్రతను పటిష్టం చేసేందుకు మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. విదేశాంగ మంత్రి ప్రస్తుతం మారిషస్‌లో ఉన్నారని, అక్కడి నుంచి 11,12 తేదీల్లో యూఏఈలో పర్యటిస్తారని తెలిపారు. భారత్–యూఏఈ సంబంధాల బలోపేతంపై అక్కడి నాయకులతో చర్చిస్తారని అన్నారు. పెట్రోలియం మంత్రి సైతం ప్రస్తుతం ఖతార్‌లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. భారత్‌కు నమ్మకమైన ఇంధన సరఫరాదారుగా ఉన్న ఖతార్ సైతం భారత్‌తో ఇందన సహకారానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపిందని వివరించారు. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకుని రావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎల్‌పీజీ, పెట్రోల్ ఇతర ఇంధన నిల్వలకు ఎటువంటి కొరతా లేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ పేర్కొన్నారు. పెట్రోల్ బంకులలో తగినంత నిల్వలు ఉన్నాయని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా సాధారణంగానే ఉందన్నారు. ఇకపోతే లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న వైమానిక దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో పౌరులు మరణించినట్టు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నట్టు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉద్రిక్తలు తగ్గించి సంయమనం పాటించాలని కోరింది. అంతర్జాతీయ చట్టాల గౌరవం, పౌరుల రక్షణ అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. లెబనాన్ ఈ ఒప్పందం పరిధిలోకి రాదని ఇజ్రాయెల్ వాదిస్తోంది. లెబనాన్‌పై దాడులు ఆపకుంటే అమెరికాతో శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ హెచ్చరిస్తోంది.'లెబనాన్‌పై దాడుల్లో పెద్దసంఖ్యలో పౌరులు మరణించినట్టు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. యూఎన్‌ఐఎఫ్‌ఐఎల్‌కు ట్రూప్ కంట్రిబ్యూటింగ్ దేశంగా లెబన్‌నాన్‌లో శాంతి, భద్రతలకు భారత్ ఎంతో వెచ్చిస్తోంది. జరుగుతున్న పరిణామాలు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. పౌరుల రక్షణ, అంతర్జాతీయ చట్టాలు, దేశాల సౌర్వభౌమాధికారాన్ని గౌరవించాలని కోరుతున్నాం . భారతదేశం ఎప్పుడూ పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. లెబనాన్‌లోని భారత పౌరుల భద్రతను అక్కడి ఇండియన్ ఎంబసీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది' అని విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైశ్వాల్ మీడియా సమావేశంలో తెలిపారు. పశ్చిమాసియాలో పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నామని, గల్ఫ్ ప్రాంతాల్లోని దేశాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు సాగిస్తున్నామని జైశ్వాల్ తెలిపారు.

# వండర్‌కిడ్ వైభవ్ వీరవిహారం

## బెంగళూరుపై రాయల్స్‌దే పైచేయి.. రాణించిన జురెల్
## డిఫెండింగ్ చాంపియన్‌కు తొలి ఓటమి



గువాహటి: క్రీజులోకి దిగితే బౌలర్ ఎవరన్నదీ లెక్కచేయకుండా బంతిని బౌలర్ల చేతుల్లో కంటే బౌండరీ లైన్ ఆవలే ఎక్కువసేపు ఉంచుతున్న వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీ (26 బంతుల్లో 78, 8 ఫోర్లు, 7 సిక్సులు) మరోసారి ఆకాశమే హద్దుగా చెలరేగడంతో రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్‌లో వరుసగా నాలుగో విజయాన్ని నమోదుచేసింది. వైభవ్‌తో పాటు ధ్రువ్ జురెల్ (43 బంతుల్లో 81 నాటౌట్, 8 ఫోర్లు, 3 సిక్సులు) మరో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో ఆ జట్టు.. గువాహటిలో డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరును 6 వికెట్ల తేడాతో ఓడించి అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ఆర్‌సీబీ.. రజత్ పాటిదార్ (40 బంతుల్లో 63, 4 ఫోర్లు, 4 సిక్సులు) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు కోహ్లీ (16 బంతుల్లో 32, 7 ఫోర్లు), వెంకటేశ్ అయ్యర్ (15 బంతుల్లో 29 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సులు) రాణించడంతో 8 వికెట్ల నష్టానికి 201 రన్స్ సాధించింది.

### వైభవ్ వండర్స్

రాయల్స్ విజయంలో వైభవ్ విన్యాసాలే హైలైట్. పవర్ ప్లేలో అతడు జురెల్ అండగా ఆర్‌సీబీ బౌలర్లపై నిర్ధాక్షిణ్యంగా విరుచుకుపడటంతో ఛేదనను రాజస్థాన్ ధాటిగా ఆరంభించింది. ముంబైతో మ్యాచ్‌లో బుమ్రా, బౌల్ట్ వంటి బౌలర్ల భరతం పట్టిన వైభవ్.. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఆసీస్ అగ్రశ్రేణి పేసర్ జోష్ హాజిల్‌వుడ్‌కూ తన బ్యాటింగ్ ప్రతాపాన్ని రుచి చూపించాడు. జైస్వాల్ (13) త్వరగానే నిష్క్రమించినా భువీ తొలి ఓవర్లో రెండు బౌండరీలతో దంచుడుకు ముహూర్తం పెట్టిన వైభవ్.. మూడో ఓవర్ విసిరిన అభినందన్‌కు రెండు ఫోర్లు, సిక్స్‌తో స్వాగతం పలికాడు. ఆ తర్వాత బాధితుడు హాజిల్‌వుడే. ఆ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లకు తోడు డీప్ స్క్వేర్ లెగ్ మీదుగా బాదిన సిక్స్‌తో 19 రన్స్ వచ్చాయి.

అదే ఊపులో ఈ బీహార్ కుర్రాడు భువీ ఓవర్లో రెండు భారీ సిక్సలతో 15 బంతుల్లోనే ఈ సీజన్‌లో రెండో అర్ధశతకాన్ని సాధించాడు. పవర్ ప్లే ఆఖరు ఓవర్ వేసిన అభినందన్ ఓవర్లో జురెల్.. 4, 6, 4, 6, 4 బాదడంతో ఆరు ఓవర్లకు ఆతిథ్య జట్టు 97/1తో తిరుగులేని స్థితిలో నిలిచింది. డేవిడ్ ఓవర్లో రెండు సిక్సలతో రెచ్చిపోయిన వైభవ్.. కృనాల్ 9వ ఓవర్లో లాంగాన్‌లో కోహ్లీ చేతికి చిక్కడంతో 108 పరుగుల (37 బంతుల్లోనే) రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కానీ అప్పటికే రాజస్థాన్ విజయం దాదాపుగా ఖాయమైంది. హెట్‌మెయర్, కెప్టెన్ పరాగ్ విఫలమైనా జురెల్.. రవీంద్ర జడేజా (24*) అండతో లాంఛనాన్ని పూర్తిచేశాడు. జడ్డూ, జురెల్ జోడీ ఐదో వికెట్‌కు 68 రన్స్ జోడించింది.

### రజత్ కెప్టెన్ ఇన్నింగ్స్

వర్షం కారణంగా గంట ఆలస్యంగా ఆరంభమైన మ్యాచ్‌లోమొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీకి టాపార్డర్ నిరాశపరిచినా రజత్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. తన వరుస ఓవర్లలో ఆర్చర్.. సాల్ట్‌ను, మూడు బౌండరీలతో జోరు మీద కనిపించిన పడిక్కల్ (14)ను ఔట్ చేయడంతో పర్యాటక జట్టు ప్రారంభంలోనే రెండు వికెట్లు కోల్పోయింది. ఏడు ఫోర్లతో దూకుడుగానే ఆడిన కోహ్లీ.. బిష్ణోయ్ ఐదో ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అదే ఊపులో రాజస్థాన్ బౌలర్లు.. కృనాల్ (1), జితేశ్ (5), డేవిడ్ (13)ను పెవిలియన్‌కు పంపడంతో ఆర్‌సీబీ 11 ఓవర్లకు 94/6తో పీకల్లోతు కష్టాల్లో నిలిచింది. ఈ క్రమంలో రజత్.. షెఫర్డ్ (22), వెంకటేశ్ అండగా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ త్రయం.. ఆఖరి ఓవర్లలో రాజస్థాన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి ఆ జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు.

### సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లకు 201/8 (రజత్ 63, కోహ్లీ 32, బిష్ణోయ్ 2/32, ఆర్చర్ 2/33);

రాజస్థాన్: 18 ఓవర్లకు 202/4 (జురెల్ 81*, వైభవ్ 78, కృనాల్ 2/30, హాజిల్‌వుడ్ 2/44)



# ధోనినే నా రోల్ మోడల్

## ముకుల్ చౌదరి కీలక వ్యాఖ్యలు

ఐపీఎల్ అంటేనే అనామక ఆటగాళ్లను రాత్రికి రాత్రే స్టార్లుగా మార్చే వేదిక. 2026 సీజన్‌లో అటువంటి ఒక అద్భుత సంచలనం నమోదైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో కేకేఆర్ బౌలర్లను ఉతికి ఆరేసిన ముకుల్ చౌదరి ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ అయ్యాడు. కేవలం 27 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీతో లక్నో సూపర్ జెయింట్స్ కి అద్భుత విజయాన్ని అందించిన ఈ కుర్రాడి వెనుక ఒక స్ఫూర్తిదాయకమైన కథ ఉంది. ముకుల్ చౌదరి రాజస్థాన్‌లోని ఒక సాధారణ సైనిక కుటుంబం నుండి వచ్చాడు. అతని తండ్రి భారత సైన్యంలో జవాన్‌గా దేశ సేవ చేశారు. "పోరాటం నా రక్తంలోనే ఉంది" అని ముకుల్ గర్వంగా చెబుతుంటాడు. చిన్నప్పటి నుండి క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో పెరిగిన ముకుల్, తన తండ్రి నుండి మొండి పట్టుదలను నేర్చుకున్నాడు. మైదానంలో ఎంతటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా లొంగిపోకుండా పోరాడే గుణం అతనికి తన తండ్రి వల్లే వచ్చిందని మ్యాచ్ అనంతరం ముకుల్ భావోద్వేగంతో వెల్లడించాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ముకుల్ క్రీజులోకి వచ్చాడు. సునీల్ నరైన్, మిచెల్ స్టార్క్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కోవడం ఏమాత్రం సులభం కాదు. కానీ ముకుల్ ఏమాత్రం బెదరకుండా తన బ్యాట్‌కు పనిచెప్పాడు. మైదానం నలుమూలలా సిక్సర్ల వర్షం కురిపించాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో అతను ఆడిన తీరు చూస్తుంటే ఒక అనుభవం ఉన్న ఫినిషర్ ఆడుతున్నట్లుగా అనిపించింది. ముకుల్ చౌదరి ఎంఎస్ ధోనీకి వీరాభిమాని. "నేను చిన్నప్పటి నుండి ధోనీ భాయ్‌ని చూస్తూ పెరిగాను. మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి ఎలా ముగించాలో ఆయనను చూసే నేర్చుకున్నాను. నా బ్యాటింగ్ స్టైల్‌లో కూడా ఆయన ప్రభావం ఉంటుంది" అని ముకుల్ పేర్కొన్నాడు. లక్నో జట్టు డైరెక్టర్ టామ్ మూడీ కూడా ముకుల్ బ్యాటింగ్‌ను మెచ్చుకుంటూ.. అతను జట్టుకు దొరికిన అసలైన ఆణిముత్యం అని కొనియాడారు. ముకుల్ ప్రయాణం అంత సులభంగా సాగలేదు. రాజస్థాన్ దేశవాళీ క్రికెట్‌లో నిలదొక్కుకోవడానికి అతను ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. కనీసం బ్యాట్ కొనుక్కోవడానికి కూడా ఇబ్బంది పడిన రోజులు ఉన్నాయని అతను గుర్తు చేసుకున్నాడు. అయితే తన ప్రతిభను గుర్తించిన లక్నో స్కౌట్స్, అతనికి ట్రయల్స్‌లో అవకాశం ఇచ్చారు. అక్కడ తన పవర్‌ఫుల్ హిట్టింగ్‌తో మెప్పించిన ముకుల్, ఇప్పుడు ఐపీఎల్ వేదికపై తన సత్తా చాటుతున్నాడు. ఒక్క ఇన్నింగ్స్‌తో ముకుల్ చౌదరి పేరు ఇప్పుడు సోషల్ మీడియాలో మారుమోగిపోతోంది. రిషభ్ పంత్ నేతృత్వంలోని లక్నో జట్టుకు ఇతను ఒక ప్రధాన అస్త్రంగా మారాడు. తన తండ్రి సరిహద్దులో దేశాన్ని రక్షిస్తే, తాను మైదానంలో పరుగుల వర్షం కురిపించి తండ్రి పేరు నిలబెడుతున్నానని ముకుల్ చెప్పిన మాటలు అభిమానుల హృదయాలను గెలుచుకుంటున్నాయి. మరిన్ని మ్యాచుల్లో ముకుల్ ఇలాగే రాణించి భారత జట్టులోకి రావాలని ఆశిద్దాం.



# తమ్ముడికి హ్యాండిచ్చిన సారా టెండూల్కర్

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయ సారా టెండూల్కర్ లక్నోలో సందడి చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య ఆదివారం జరిగే మ్యాచ్ కోసం ఆమె లక్నోకు వచ్చినట్లు తెలుస్తోంది. లక్నో ఎయిర్‌పోర్ట్‌లో సారా టెండూల్కర్‌ను చూసిన మీడియా ప్రతినిధులు.. ఎవరికి సపోర్ట్ చేస్తారంటూ ఆమెను ప్రశ్నించారు. గుజరాత్ టైటాన్స్ జట్టుకా..? లేక తన తమ్ముడు అర్జున్ టెండూల్కర్ ప్రాతినిథ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు మద్దతు తెలుపుతారా? అని ప్రశ్నించారు. సారా టెండూల్కర్ మాత్రం సమాధానం చెప్పకుండా చిరునవ్వుతో వారికి దూరంగా వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. తన ప్రియుడు శుభ్‌మన్ గిల్ కోసమే సారా టెండూల్కర్ లక్నోకు వచ్చిందని, గుజరాత్ టైటాన్స్‌కే మద్దతు తెలుపుతుందని కామెంట్ చేస్తున్నారు. తమ్ముడు జట్టు అయిన లక్నో సూపర్ జెయింట్స్‌కు సపోర్ట్ చేసేందుకు అతను ఏమైనా తుది జట్టులో ఆడుతాడా? అని ప్రశ్నిస్తున్నారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్‌కు మద్దతు తెలిపేందుకే సారా లక్నోకు వచ్చిందని, లేకుంటే తన తమ్ముడు ప్రాతినిథ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు మద్దతు తెలుపుతానని మీడియాకు తెలిపేదని ఫ్యాన్స్ అంటున్నారు. ఏది ఏమైనా సొంత తమ్ముడికి సారా టెండూల్కర్ షాకిచ్చిందని, తమ్ముడు అర్జున్ టెండూల్కర్ కంటే ప్రియుడు శుభ్‌మన్ గిల్ ఎక్కువయ్యాడని కామెంట్ చేస్తున్నారు. సారా టెండూల్కర్, శుభ్‌మన్ గిల్ పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఇద్దరూ తమ ప్రేమ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ వార్తలను కూడా ఖండించలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన లక్నో ఆదివారం సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. శుక్రవారం సారా టెండూల్కర్ లక్నో ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో ఈ మ్యాచ్ కోసమే సారా వచ్చిందని అంతా అనుకుంటున్నారు. కానీ ఆమె రాకపై ఎలాంటి క్లారిటీ లేదు. బహుషా అర్జున్ సతీమణి, తన మరదలుకు తోడుగా వచ్చి ఉంటుందని, అనవసర పుకార్లు పుట్టించవద్దని సచిన్ ఫ్యాన్స్ కోరుతున్నారు.

# మైదానంలో కారుతో వైభవ్ సూర్యవంశీ సందడి



ఐపీఎల్ 2026 సీజన్ కేవలం ఫోర్లు, సిక్సర్లతోనే కాదు.. మైదానం బయట ఆటగాళ్లు చేసే అల్లరితోనూ ఫ్యాన్స్‌ను విపరీతంగా అలరిస్తోంది. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ శిబిరంలో నవ్వుల పువ్వులు పూయిస్తున్న కొన్ని సరదా సంఘటనలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అటు కుర్రాడు వైభవ్ సూర్యవంశీ రిమోట్ కారు ఆటలు, ఇటు అశ్విన్ వేసిన సెటైర్లు నెటిజన్లను కడుపుబ్బ నవ్విస్తున్నాయి. ఐపీఎల్ 2026 ప్రాక్టీస్ సెషన్లలో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే ఈసారి అతను బ్యాట్‌తో కాదు, ఒక రిమోట్ కారుతో వార్తల్లో నిలిచాడు. గ్రౌండ్‌లో రిమోట్ కారును నడుపుతూ వైభవ్ ఎంజాయ్ చేస్తున్న వీడియోను టీమ్ సిబ్బంది రికార్డ్ చేశారు. ఆ సమయంలో రాయల్స్ సపోర్ట్ స్టాఫ్ ఒకరు జోక్ చేస్తూ.. "అబ్బాయికి ఇంకా డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదు, కారు నడుపుతున్నాడు" అని అనడం వీడియోలో వినిపించింది. ఈ సరదా సంభాషణ ఇప్పుడు సోషల్ మీడియాలో మీమ్స్ రూపంలో విపరీతంగా తిరుగుతోంది. తీవ్రమైన ప్రాక్టీస్ మధ్య ఇలాంటి చిన్న చిన్న సరదాలు టీమ్ వాతావరణాన్ని ఉల్లాసంగా ఉంచుతాయని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. మరోవైపు, ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. గౌహతి వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో వారిద్దరి బ్యాటింగ్ చూసి కామెంట్రీ బాక్స్‌లో ఉన్న లెజెండరీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ (భజ్జీ) అప్రయత్నంగా లేచి నిలబడి సెల్యూట్ కొట్టారు. దీనిపై మన తెలివైన స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తనదైన శైలిలో స్పందించాడు. ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేస్తూ.. "నా వైపు నుంచి కూడా సెల్యూట్. కానీ మా మిత్రుడు పుజారా మాత్రం సరిగ్గా సెల్యూట్ చేయలేదు" అంటూ చెతేశ్వర్ పుజారాను ట్యాగ్ చేసి ఆటపట్టించాడు. అశ్విన్ చేసిన ఈ పోస్ట్ నెటిజన్లను కడుపుబ్బ నవ్విస్తోంది. మైదానంలో ప్రత్యర్థులకు చుక్కలు చూపే అశ్విన్, బయట తన తోటి ఆటగాళ్లతో ఎంత సరదాగా ఉంటాడో ఈ సంఘటన మరోసారి నిరూపించింది. రాజస్థాన్ రాయల్స్ జట్టు ఈ సీజన్‌లో అటు విజయాలతో పాటు ఇటు సోషల్ మీడియాలో కూడా టాప్ గేర్‌లో దూసుకుపోతోంది. సీనియర్ ఆటగాళ్లు, జూనియర్ల మధ్య ఉన్న ఈ సమన్వయం మరియు స్నేహం జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. డిజిటల్ యుగంలో క్రికెట్ అంటే కేవలం ఆట మాత్రమే కాదు, ఇలాంటి హ్యూమర్ కూడా ఒక భాగమైపోయింది.

# అరుంధతి చౌదరికి స్వర్ణం




భారత క్రీడారంగంలో మరో ధ్రువతార మెరిసింది. అడ్డంకులు ఎన్ని ఎదురైనా, సంకల్పం బలంగా ఉంటే విజయం వరిస్తుందని రాజస్థాన్‌కు చెందిన బాక్సర్ అరుంధతి చౌదరి నిరూపించారు. మంగోలియాలోని ఉలాన్‌బాటర్ వేదికగా జరిగిన ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటారు. ముఖ్యంగా మూడేళ్ల పాటు గాయంతో పోరాడి, రింగుకు దూరమైన తర్వాత ఆమె సాధించిన ఈ విజయం క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తోందనే చెప్పాలి. అరుంధతి గెలుపుతో ఆమె స్వగ్రామమైన కోటలో పండుగ వాతావరణం నెలకొంది. మంగోలియాలో జరుగుతున్న ఆసియా బాక్సింగ్ ఎలైట్ ఛాంపియన్‌షిప్‌లో అరుంధతి చౌదరి అద్భుతమైన ఫామ్‌ను కనబరిచారు. గురువారం 70 కేజీల ఫైనల్ మ్యాచ్‌లో ఆమె ప్రత్యర్థి బక్త్? సెడిష్? (కజకిస్థాన్?)పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి 4-1 స్కోరుతో ఘనవిజయం సాధించారు. కజకిస్థాన్ వంటి బలమైన దేశాల నుంచి వచ్చిన బాక్సర్లను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడటం సామాన్యమైన విషయం కాదు. నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గోహైన్ వంటి వరల్డ్ ఛాంపియన్లతో కూడిన భారత జట్టులో అరుంధతి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అరుంధతి ప్రయాణం పూల బాట ఏమీ కాదు. మణికట్టుకు తీవ్రమైన గాయం కావడంతో ఆమె దాదాపు మూడేళ్ల పాటు బాక్సింగ్ రింగుకు దూరమయ్యారు. ఈ క్రమంలో ముంబయిలో ఆమెకు రెండు సార్లు శస్త్రచికిత్సలు జరిగాయి. వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ మానసిక ధైర్యాన్ని కోల్పోకుండా ఆమె చేసిన పోరాటాన్ని ఆమె తండ్రి సురేష్ చౌదరి వనవాసంతో పోల్చారు. గాయం నుంచి కోలుకున్న కేవలం ఆరు నుంచి ఎనిమిది నెలల కాలంలోనే ఆమె మళ్లీ ఫామ్?లోకి రావడం విశేషం. పట్టుదలే ఆమెను మళ్లీ ఛాంపియన్‌గా మార్చింది. అరుంధతి స్వర్ణం గెలిచిన వార్త తెలియగానే కోటలోని ఆమె నివాసం వద్ద కోలాహలం మొదలైంది. ఈ విజయం గురించి ఆమె తల్లిదండ్రులు మాట్లాడుతూ ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. "నా కూతురు రాజస్థాన్‌కు మాత్రమే కాదు, దేశం మొత్తానికి గర్వకారణంగా నిలిచింది" అని తండ్రి సురేష్ చౌదరి ఆనందం వ్యక్తం చేశారు. ఆసియా స్థాయిలో ఇంతటి పోటీని ఎదుర్కొని గెలవడం గర్వంగా ఉందన్నారు. ఆమె తల్లి సునీతా చౌదరి మాట్లాడుతూ నేటి కాలంలో కుమారుల కంటే కుమార్తెలే దేశానికి ఎక్కువ కీర్తిని తీసుకువస్తున్నారని గర్వంగా చెప్పారు. అరుంధతి గత కొద్దికాలంగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. నోయిడాలో జరిగిన వరల్డ్ కప్‌లో స్వర్ణం గెలిచిన ఆమె, ఆ తర్వాత స్పెయిన్‌లో జరిగిన 'బాక్సామ్' ఇంటర్నేషనల్ టోర్నీలో 70 కేజీల విభాగంలో పసిడి పతకాన్ని సాధించారు. ఇప్పుడు ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కూడా అదే జోరును కొనసాగించి తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. సెమీఫైనల్ అలాగే ఫైనల్ మ్యాచ్‌లలో ఆమె చూపిన తెగువ చూస్తుంటే, రాబోయే పెద్ద టోర్నీలకు ఆమె పవర్ఫుల్?గా సిద్ధమైనట్లు అర్థమవుతుంది. అరుంధతి కోచ్ అశోక్ గౌతమ్ ఆమె సాధించిన విజయాన్ని కొనియాడారు. "ఈ టోర్నీలో ప్రపంచస్థాయి బాక్సర్లు పాల్గొన్నారు. ఇక్కడ స్వర్ణం గెలుచుకోవడం అంటే దాదాపు వరల్డ్ కప్ గెలిచినట్లే" అని అభిప్రాయపడ్డారు. నిఖత్ జరీన్, లవ్లీనా వంటి దిగ్గజాల సమక్షంలో అరుంధతి ఇంతటి ప్రదర్శన చేయడం ఆమె ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందన్నారు. ఆమెలోని టెక్నిక్ స్పీడ్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయని వివరించారు. ఆసియా టైటిల్ సాధించిన తర్వాత అరుంధతి విశ్రాంతి తీసుకోవాలని అనుకోవడం లేదు. త్వరలోనే ఆమె కోటకు చేరుకుని, ఆ తర్వాత గ్లాస్గోలో జరగబోయే కామన్వెల్త్ గేమ్స్ కోసం సిద్ధం కానున్నారు. దీనికోసం ఆమె ఉజ్బెకిస్థాన్ లేదా అమెరికాలో ప్రత్యేక శిక్షణ తీసుకునే అవకాశం ఉంది. అరుంధతి నెక్స్ట్ టార్గెట్ ఒలింపిక్స్‌లో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడమే. తన ఆరోగ్య సమస్యలను, ముఖ్యంగా శ్వాసకోశ ఇబ్బందులను అధిగమిస్తూ ఆమె సాగిస్తున్న ఈ ప్రయాణం తప్పక ఒలింపిక్ పతకం వైపు తీసుకెళ్తుందని ఆమె కుటుంబం నమ్ముతోంది. అరుంధతితోపాటు ప్రీతి పవార్ (54 కేజీ), ప్రియ (60 కేజీ), మీనాక్షి హుడా (48 కేజీ) గోల్డ్ మెడల్స్ సాధించారు. హువాంగ్ (చైనీస్ తైపీ)పై 5- 0 తేడాతో ప్రీతి నెగ్గగా, 5- 0 తేడాతోనే నోమన్‌దరి (మంగోలియా)పై మీనాక్షి విజయం సాధించింది. ఇక 3- 0 తేడాతో వాన్ యంగ్ (ఉత్తర కొరియా)పై ప్రియ గెలుపొంది స్వర్ణం ముద్దాడింది.

మానేరు జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
శనివారం 11 ఏప్రిల్ 2026




# ప్రియాంక చోప్రా బ్యూటీ సీక్రెట్ చెప్పిన తల్లి!

మాజీ విశ్వసుందరి, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం అభినయంతో ఎంతోమందిని ఆకట్టుకుంటూ నేడు ప్రపంచ స్థాయి గుర్తింపును సొంతం చేసుకున్న ఈ బ్యూటీ.. 43 సంవత్సరాల వయసులో కూడా అంతే అందంగా.. యవ్వనంగా కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తోంది. మరి ఈ గ్లోబల్ స్టార్ బ్యూటీ సీక్రెట్ ఏంటి? అసలు ఇంత అందంగా ఉండడానికి ఆమె ఏం ఉపయోగిస్తుంది? అంటూ అభిమానులు సైతం తెలుసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.. మరి ప్రియాంక చోప్రా బ్యూటీ సీక్రెట్ ను ఆమె తల్లి మధు చోప్రా రివీల్ చేశారు. ప్రియాంక చోప్రా తల్లి డాక్టర్ మధు చోప్రా మాట్లాడుతూ..” నేను , నా కూతురు దశాబ్దాలుగా భారతదేశ చర్మ సంరక్షణలో భాగంగా అత్యంత ప్రావీణ్యం పొందిన శనగపిండి, పసుపు ఫేస్ ప్యాక్ ను ఉపయోగిస్తాము. ఇది చాలా బాగా పనిచేస్తుంది. ముఖ్యంగా పసుపు , శనగపిండి , కొద్దిగా పాలను కలిపి ముఖానికి అప్లై చేసుకున్నట్లయితే ఈ ఫేస్ ప్యాక్ ముఖాన్ని శుభ్రపరుస్తుంది. చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది. అలాగే మొటిమలు , చర్మంపై ఉండే నలుపుదనం, నిర్జీవమైన ముఖం వంటి సమస్యలు పూర్తిగా తొలగిపోతాయి.. ముఖ్యంగా చర్మాన్ని తిరిగి రిపేర్ చేయడంలో ఈ ఫేస్ ప్యాక్ చాలా అద్భుతంగా పనిచేస్తుంది. నిత్యం కఠినమైన రసాయనాలు కలిగిన ఫేస్ క్రీమ్స్ వల్ల చర్మం ఎంతో ఇబ్బందికి గురవుతుంది. ఇక దాని నుంచి విముక్తి పొందాలి అంటే ఈ ఫేస్ ప్యాక్ చాలా చక్కగా ఉపయోగపడుతుంది అంటూ ప్రియాంక చోప్రా తల్లి చెప్పుకొచ్చింది.




# దసరాకు రిలీజ్ చేసేలా.. ఫౌజీ షూటింగ్ స్పీడ్

ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి.. దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# అదే బాధగా ఉంది.. ఫ్లాపులపై నోరు విప్పిన కృతి

తెలుగు చిత్రసీమలో ఉప్పెన సినిమాతో ఒక సంచలనంగా ఎంట్రీ ఇచ్చిన కృతి శెట్టి, బేబమ్మ పాత్రతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచింది. కెరీర్ ప్రారంభంలోనే అలాంటి బలమైన పాత్ర దక్కడం ఆమెకు వరుస అవకాశాల దారులు తెరిచింది. అయితే, ఆ తర్వాత వచ్చిన సినిమాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోకపోవడం ఆమె ప్రయాణాన్ని కొంత మందగింపజేసింది. ఇప్పటివరకు తన ఫ్లాప్స్ గురించి ఎక్కువగా మాట్లాడని కృతి, తాజాగా మాత్రం తన మనసులోని భావాలను బయటపెట్టింది. తను నటించిన సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయనే బాధ కంటే, బేబమ్మ లాంటి బలమైన పాత్రలు మళ్లీ దక్కకపోవడమే తనకు ఎక్కువగా బాధ కలిగిస్తోందని చెప్పిన మాటలు ఆమె నిజాయితీని, తన పని పట్ల ఉన్న కమిట్‌మెంట్‌ను ప్రతిబింబిస్తున్నాయి. పని చేయడం మాత్రమే నా చేతిలో ఉంది, ఫలితం నా చేతిలో ఉండదని కృతి ఈ విషయంలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది. కెరీర్ పరంగా చూస్తే, ఉప్పెన తర్వాత కృతి చేసిన సినిమాల్లో పాత్రల బలం కొంత తగ్గిందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వినిపిస్తోంది. కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, ఆ పాత్రలు ప్రేక్షకులకు స్ట్రాంగ్ గా కనెక్ట్ అవలేకపోయాయి. అదే కృతి కెరీర్‌లో ప్రధాన లోటుగా మారిందని చెప్పవచ్చు. ఇతర హీరోయిన్స్ తమ కెరీర్‌ను జాగ్రత్తగా మలుచుకుంటున్న తరుణంలో, కృతి గ్రాఫ్ మాత్రం ఊహించినంతగా పెరగలేదు. ఇలాంటి సమయంలో ఆమె తన ఆశలన్నింటినీ లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్ర ప్రమోషన్స్ లోనే కృతి తన సినిమాల ఫ్లాపుల విషయంపై మాట్లాడగా, ప్రస్తుతం ఆ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# కథలో బలం లేకున్నా కథనంలో కొత్తదనం

## డెకాయిట్‌గా ఫర్వాలేదనిపించిన అడవిశేష్

అడివి శేష్ డబుల్ హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్నారు. పైగా 'మేజర్'తో జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'డెకాయిట్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. హరిదాస్ (అడివి శేష్) ఓ హత్య కేసులో 13 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తుంటాడు. ఓరోజు తనని కడప జైలు నుంచి మారుస్తుండగా పోలీసుల నుంచి తప్పించు కుంటాడు. దీనికోసం ఇషాద్ భాయ్ (అతుల్ కులకర్ణి) అతనికి సాయం చేస్తాడు. హరి అలా తప్పించుకోగానే తనని దుబాయ్ పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా.. దానికోసం ఇంకా రూ.60లక్షలకు పైగా డబ్బు అవసరమవుతుంది. అయితే అతను దుబాయ్‌కి వెళ్లేలోపు తనకు అవసరమైన డబ్బు సంపాదించడంతో పాటు మరో పని కూడా చేయాలనుకుంటాడు. తనని జైలు పాలయ్యేలా చేసిన తన మాజీ ప్రేయసి సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్)పై పగ తీర్చు కోవాలని నిర్ణయించుకుంటాడు. ఈక్రమంలోనే ఆమెను వెతుక్కుంటూ ఇంటికెళ్లగా ఓ ఆరేళ్ల కూతురి తల్లిగా దర్శనమిస్తుంది సరస్వతి. ఆమె భర్త భాస్కర్ (వైభవ్) తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలై ఉంటాడు. తన ప్రాణాలు కాపాడాలంటే ఆమెకు రూ.1కోటి డబ్బు అవసరం. ఆమె పరిస్థితిని చూసిన హరి.. తన ఆర్థిక అవసరాన్ని అడ్డం పెట్టుకునే దెబ్బ కొట్టాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. హరిని సరస్వతి హత్య కేసులో ఎందుకు ఇరికించింది? దీనికి ఆమె భర్త భాస్కర్‌కు ఉన్న లింకేంటి? ఈ కథలో సీఐ స్వామి అలియాస్



రాంబాబు (అనురాగ్ కశ్యప్), కరుణ హాస్పిటల్స్ ఛైర్మన్ (ప్రకాశ్ రాజ్), మల్లి (కామాక్షి భాస్కర్ల) పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటన్నదే కథ. అడివి శేష్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో బలమైన భరోసా కనిపిస్తుంది. తను ఓ కథ ఎంచుకున్నాడంటే తప్పకుండా అందులో ఏదో వైవిధ్యత ఉంటుందని.. థ్రిల్‌కు ఏ లోటు ఉండదని అందరి నమ్మకం. ఇక ఈసారి 'డెకాయిట్'కి తనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించాడనే సరికి దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. కథ, కథనాల్లో మరీ అంత కొత్తదనమేమీ లేకపోయినా కొన్ని మెరుపులతో ఆ లోటు తెలియనీయలేదు. ఓ కులాంతర ప్రేమకథకు.. తనదైన శైలిలో ట్విస్ట్‌లు, టర్న్‌లు జోడించి ఓ మాస్ యాక్షన్ సినిమాని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు శేష్ . హీరో ఎప్పుడైతే జైలు నుంచి తప్పించుకుంటాడో అక్కడి నుంచి సినిమా వేగం పుంజుకుంటుంది. హీరో ఎప్పుడైతే కథానాయిక జీవితంలోకి తిరిగి ఎంట్రీ ఇస్తాడో అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. వాళ్లిద్దరూ కలిసి డబ్బు దోచుకునేందుకు సిద్ధమైనప్పటి నుంచి ఆ సంఘర్షణ రెట్టింపవుతుంది. ఓ వైపు నాయకానాయికల్ని వెతికి పట్టుకునేందుకు సీఐ స్వామి రంగంలోకి దిగడం.. వాళ్లని తప్పించుకుని, కథానాయికని పోలీసులకు పట్టించాలని హీరో చేసే ప్రయత్నాలతో ద్వితీయార్ధం థ్రిల్లింగ్‌గా మొదలవుతుంది. క్లైమాక్స్‌ని భావోద్వేగభరితంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో హీరో చేసే త్యాగం 'ప్రేయసి రావే' లాంటి క్లాసిక్ చిత్రాన్ని గుర్తు చేస్తుంది. కాకపోతే ఆ ముగింపును ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారన్న దానిపై చిత్ర ఫలితం ఆధారపడి ఉంది. హరిదాస్ పాత్రలో మాసీ లుక్స్‌లో అడివి శేష్ కనిపించిన విధానం.. తన నటన.. మదనపల్లి యాసలో పలికిన సంభాషణలు అన్నీ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. యాక్షన్‌తో పాటు భావోద్వేగభరిత సన్ని వేశాల్లోనూ అదరగొట్టారు. తన జూలియట్‌గా సరస్వతి పాత్రలో మృణాల్ ఒదిగిన తీరు ఆకట్టుకుంటుంది. అడివి శేష్ రాసుకున్న కథలో కొత్తదనం లేదు. స్క్రీన్‌ప్లేతో తనదైన శైలిలో అక్కడక్కడా మ్యాజిక్ చేసే ప్రయత్నం చేశారు.

# మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు అనుమతి

## పరిశీలించి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



తిమ్మాపూర్, జనతా న్యూస్ తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు ప్రభుత్వం నుండి అనుమతి తీసుకున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఉదయం బస్టాండ్ ఆవరణలోని మహనీయులు డా.బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ల విగ్రహాలను, స్థలాన్ని పరిశీలించారు. వెంటనే పనులు ప్రారంభించాలని అంబేద్కర్, దళిత సంఘాల నాయకులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023 ఏప్రిల్ లో అనుమతి తీసుకోకుండా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసినారని, అప్పటి ఆర్టీసీ ఎండీకి అప్పటి ఎమ్మెల్యేకి జరిగిన సంభాషణ కారణంగా ఆవిష్కరణకు నోచుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకోవడం ద్వారా విగ్రహాల ఆవిష్కరణకు అనుమతి తీసుకున్నట్లు చెప్పారు. ఇందుకు రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతోపాటు జిల్లా అధికారులు, అంబేద్కర్, దళిత సంఘాల నాయకులు, జేఏసీ నాయకులు శ్రమించారని తెలిపారు. రానున్న రోజుల్లో బస్టాండ్ ప్రాంతాన్ని సుందరీకరణ చేసి విగ్రహాలను ఆవిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆవిష్కరణ అనుమతికి కృషి చేసిన ప్రభుత్వ పెద్దలకు, మంత్రి పొన్నం ప్రభాకర్ కి, ఎస్సీ కమీషన్ చైర్మన్ వెంకటయ్యకి, అధికారులకు, ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట తిమ్మాపూర్ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, నాయకులు మోరపెల్లి రమణారెడ్డి, పోలు రాము, మాతంగి లక్ష్మణ్, కనుకం రాములు, సముద్రాల లక్ష్మణ్, సురేందర రెడ్డి, శ్రీనివాస రెడ్డి, శేఖర్ తదితరులున్నారు.

### పెరిగిన బందోబస్తు...

తిమ్మాపూర్ బస్టాండ్ ఆవరణలోని మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు అనుమతి వచ్చిందని, వెంటనే క్లీనింగ్ పనులు చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధేశాలు జారీ చేయడంతో స్థానిక నాయకులు జేసీబీతో చెట్లను, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఆర్టీసీ సెక్యూరిటీతో విషయం తెల్సుకున్న ఆర్టీసీ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు కేవలం ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది విగ్రహాల వద్ద ఉండగా ఇక ముందు ఎలాంటి పనులు చేపట్టకుండా ఉండేందుకు పోలీసు బందోబస్తును పెంచారు. కాగా అనుమతి వస్తే పోలీసు బందోబస్తు ఎందుకు పెరుగుతుందనే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. త్వరలోనే లిఖితపూర్వంకగా అనుమతి వస్తుందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

# దౌర్జన్యంగా పశువుల కొట్టాలను కూల్చారు

### కోర్టు ఆదేశాలు దిక్కరించారన్న బాధితుడు

### న్యాయం కోరుతున్న బాధితుడు



తిమ్మాపూర్, జనతా న్యూస్ : మండలంలోని నుస్తులాపూర్ పాత గ్రామానికి వెళ్లే దారి పక్కన ఉన్న పశువుల కొట్టాలను దౌర్జన్యంగా కూల్చివేశారని బాధితుడు నుస్తులాపూర్ గ్రామస్తుడు దూల్గుంటి అనూప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తిమ్మాపూర్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నుస్తులాపూర్ లో సుమారు 60ఏళ్లకు పైగా నక్ష దారి ఉందని, దాని పక్కనే ఉన్న పట్టా భూమిలో తన తాతలు పశువుల కొట్టాలు నిర్మించారని బాధితుడు తెలిపాడు. పక్క వారు భూమిని సర్వే చేయించుకుని తమ పట్టా స్థలంలో దారి ఉందంటూ తన భూమిలోకి వచ్చారని తెలిపారు. దీనిపై గ్రామంలో పంచాయతీలు జరిగాయని చెప్పారు. పశువుల కొట్టాలు తొలగించాలని నుస్తులాపూర్ పంచాయతీ కార్యదర్శి నోటీసు జారీ చేస్తే తాము హై కోర్టుకు, జిల్లా కోర్టుకు వెళ్లినట్లు, కోర్టు సైతం స్టే ఆర్డర్, ఇంజక్షన్ ఆర్డర్ ని ఇచ్చాయని అనూప్ రెడ్డి తెలిపారు. ఆర్డర్లు అధికారులతోపాటు పక్క భూమి వారికి వచ్చాయని అన్నారు. కోర్టు ఆదేశాలుండగా రాజకీయ నాయకులు, అధికారులు, నాయకుల సహకారంతో పక్క భూమి వారు దౌర్జన్యంగా తమ పశువుల కొట్టాలను కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై కోర్టు ఆదేశాలు చూపిస్తూ పోలీసు, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లితే పట్టించుకోవడం లేదని అనూప్ రెడ్డి తెలిపారు. ఇప్పటికైనా కోర్టు ఆదేశాలను దిక్కరించిన వ్యక్తులతోపాటు అధికారులు, నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు. విలేకరుల సమావేశంలో ఆయన వెంట చింతల ఎల్లారెడ్డి, శంకర్, నారాయణ స్వామి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. కాగా దీనిపై తిమ్మాపూర్ తహశీల్దార్ శ్రీనివాస రెడ్డిని వివరణ కోరగా కూల్చివేతకు తమకు సంబంధం లేదని, 858 సర్వే నంబర్ లో పశువుల కొట్టాలు లేవని, నక్షా దారిలోనే కొట్టాలు ఉన్నాయని తెలిపారు.

# మన ఇసుక వాహనం విధానాన్ని వినియోగించుకోవాలి



జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.

### మన ఇసుక వాహన విధానంపై తహసీల్దార్లు, మైనింగ్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష.

సిరిసిల్ల. ఏప్రిల్ 10 జనతా న్యూస్.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వం ఇసుక తరలింపులో పారదర్శకత కోసం అమలు చేస్తున్న మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానాన్ని గృహ, ప్రభుత్వ పనుల నిర్మాణాదారులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానం, మొబైల్ అప్లికేషన్, ఇసుక బుకింగ్స్ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మైనింగ్ అధికారి, తహసీల్దార్లు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారితో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానం, మొబైల్ అప్లికేషన్ ఎన్ని బుకింగ్స్ వచ్చాయి అనే అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సెంటర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన మన ఇసుక వాహనం వెబ్సైట్, అప్లికేషన్ లో ఇందిరమ్మ ఇండ్లు, సొంత గృహ, ప్రభుత్వ పనుల నిర్మాణాదారులు జిల్లాలోని 15 ఇసుక రీచ్ ల నుంచి ఇసుక బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. నిర్ణీత పత్రాలు జత చేసి.. ఆన్లైన్ విధానం ద్వారా సులభంగా బుకింగ్ చేసుకునే వీలు ఉందని వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇసుక తరలింపులో నేరుగా కూపన్లు ఇచ్చే విధానం నుంచి ఆన్లైన్ ద్వారా పొందే విధానం అమలు చేస్తున్నామని వివరించారు. మన ఇసుక వాహనం విషయమై సమాచారం, వివరాలు తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందని, 040- 23120421/ 83339 23732 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అలాగే మెయిల్ ఐడీ helpdesk.tsmiv @cgg.gov.in ఉందని తెలిపారు.ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అధికారి జారీ చేసిన ధృవపత్రం జత చేయాలని, ఇతర ఇంటి నిర్మాణానికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా సంబంధిత అధికారి జారీ చేసిన ఇంటి నిర్మాణ అనుమతి పత్రాలు, ప్రభుత్వ పనులకు సంబంధిత కార్య నిర్వహణ ఇంజనీర్ జారీ చేసిన అనుమతి పత్రం జత చేయాలని సూచించారు. నిర్మాణదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఇసుక రీచ్ ఆఫీసర్ తమ ఆన్లైన్ లాగిన్లోకి వచ్చిన ఇసుక బుకింగ్స్ ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పరిశీలించాలని, ఇసుక తరలించేందుకు అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ పనుల కోసం ఆయా నిర్మాణదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునేలా ఇంజనీర్లు సూచనలు చేయాలని సూచించారు. ప్రతి నిర్మాణ పనికి ఇసుక కోసం ఆన్లైన్ లోనే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి కుమార్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సెర్మనీ



కరీంనగర్, ఏప్రిల్ 10: కరీంనగర్ భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే విషయాలపై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు విశ్లేషణాత్మకంగా బోధించడం ఎంతో అవసరమని తెలిపారు. తదుపరి తరగతికి వెళ్లే సందర్భంలో నిర్వహించే ఈ వేడుక విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి చదువుపై ఆసక్తిని మరింతగా పెంచుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేయడంతో పాటు నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో వేడుకలు మరింత ఆకర్షణీయంగా మారాయి. చిన్ననాటి నుంచే సృజనాత్మకతను పెంపొందిస్తూ, చదువును ఆనందదాయకంగా మార్చే దిశగా ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. విద్యార్థుల అభ్యాసం, అభివృద్ధిని గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ సెర్మనీ ద్వారా విద్యార్థులు పై తరగతికి వెళ్లేటప్పుడు మరింత ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పొందుతారని తెలిపారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

### హుస్నాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి

### హుస్నాబాద్‌లో చెత్త విభజనపై అవగాహన కార్యక్రమం



హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణంలోని 16వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చెత్త విభజనపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.పురపాలక సంఘ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పట్టణ ప్రజలు ఇంటి వద్దే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పురపాలక సంఘ వాహనాలకు అందించాలని సూచించారు. ఇంటి వద్ద ఖాళీ స్థలం ఉన్న వారు తడి చెత్తతో ఎరువు తయారు చేసుకుని, ఆ ఎరువును ఇంటి వద్ద పెంచే మొక్కలకు వినియోగించుకోవచ్చన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని, ప్లాస్టిక్‌కు బదులుగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను వినియోగించాలని కోరారు.అలాగే ఇంటి చుట్టుపక్కల నిల్వ ఉన్న నీటిని తరచూ తొలగించుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడాలంటే చెత్తను వేరు చేసి ఇవ్వడం ప్రతి ఇంటి యజమాని బాధ్యత అని తెలిపారు. పట్టణాన్ని ఆరోగ్యకరమైన పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ వైద్యం కిరణ్ ప్రసాద్, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, ఇన్‌చార్జ్ వార్డ్ అధికారులు మొగిలి, శ్రీకాంత్, ఆర్‌పి సృజనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో విద్యుత్ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు



హుస్నాబాద్,జనత న్యూస్: తెలంగాణ ఆర్టిజన్, పీస్‌రేట్ విద్యుత్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్ విద్యుత్ డివిజనల్ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికులను ఉద్దేశించి బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడారు.విద్యుత్ కార్మికులు గత మూడు రోజులుగా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం, విద్యుత్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని ఆయన అన్నారు. విద్యుత్ సంస్థలో అనేక సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కనీస వేతనాలు కూడా అందని పరిస్థితి ఉందని తెలిపారు.విద్యుత్ సంస్థలో ఆపరేటర్‌లు, బిల్లు రీడింగ్ సిబ్బంది, ఎస్‌పీఎం, గ్రౌండ్ లెవెల్ వర్క్ వంటి విభాగాల్లో కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు.ఆర్టిజన్ కార్మికులకు అర్హతల మేరకు హోదా మార్పులు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.సమ్మె చేస్తున్న కార్మికులను వెంటనే చర్చలకు పిలిచి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యుత్ కార్మికుల సమస్యలను గౌరవ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు.విద్యుత్ కార్మికుల పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని, వారి డిమాండ్లు పరిష్కరించకపోతే కార్మికుల తరఫున పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మికులతో పాటు బీఆర్ఎస్ నాయకులు బొజ్జ హరీష్, యాస శ్రీనివాస్, కందుకూరి సతీష్, గోపగోని అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సురక్షితంగా చేరండి - సజీవంగా ఉండండి కార్యక్రమంపై సమీక్ష: సీపీ గౌష్ ఆలం



కరీంనగర్, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన "సురక్షితంగా చేరండి -- సజీవంగా ఉండండి" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఈ నెల 13 నుండి 18 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారంవారీ కార్యాచరణపై సీపీ దిశానిర్దేశం చేశారు. ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. మొదటి రోజు గ్రామ స్థాయిలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించనున్నారు. రెండవ రోజు వాహనదారులు, విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలపై ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నారు. మూడవ రోజు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్స్ ఏర్పాటు చేయనున్నారు. నాల్గవ రోజు పాఠశాలల వద్ద భద్రతా చర్యలు చేపట్టి విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించనున్నారు. ఆటో, బస్సు, లారీ డ్రైవర్లకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాముఖ్యత వివరించనున్నారు. ఐదవ రోజు ప్రమాదాల సమయంలో "గోల్డెన్ అవర్" ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఆరవ రోజు "నో ఫైన్ డే"గా పాటించి జరిమానాల బదులు కౌన్సెలింగ్ ద్వారా వాహనదారుల్లో మార్పు తీసుకురానున్నారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని సీపీ స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేయడం ప్రాణనష్టానికి దారితీస్తుందని హెచ్చరించారు. "సురక్షితంగా చేరండి -- సజీవంగా ఉండండి" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

## ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి: నేర్నాల కిషోర్

హుస్నాబాద్, జనత న్యూస్: తెలంగాణ ఉద్యమంలో పాటలతో ప్రజలను చైతన్యపరిచిన నిరుద్యోగ కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కవి గాయకులు నేర్నాల కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో కళాకారుల బృందం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ, గౌరవ ఎమ్మెల్సీ విజయశాంతిని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేర్నాల కిషోర్ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ సమయంలో పాటలు పాడుతూ, ధూంధాం కార్యక్రమాలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి నింపిన అనేక మంది కళాకారులకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. కేవలం 550 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి మిగిలిన కళాకారులను నిర్లక్ష్యం చేసినట్టు తెలిపారు. ఉద్యమంపై నమ్మకంతో జీవితం గడిపిన పలువురు కళాకారులు ప్రస్తుతం వయసు మీదపడినా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో, పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమ కళాకారులకు వెంటనే ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయశాంతికి వినతిపత్రం అందజేశారు. అలాగే అవకాశం వచ్చినప్పుడు చట్టసభలో కళాకారుల సమస్యలను ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. మీరు మా కళామతల్లి, మేమంతా మీ బిడ్డలం. మీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసే అవకాశం కల్పిస్తే మా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తాం అని నేర్నాల కిషోర్ తెలిపారు. కళాకారుల సమస్యలను విజయశాంతి దృష్టికి తీసుకువెళ్లామని... కళాకారులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల కళాకారులు విజయశాంతికి కృతజ్ఞతలు తెలిపారు. హుస్నాబాద్‌కు చెందిన నిరుద్యోగ కళాకారులు కళ్లెం లక్ష్మణ్, తాడూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## హామీ నిలబెట్టిన ఎమ్మెల్యేకు ఘన సన్మానం



బెజ్జంకి, ఏప్రిల్ 10: మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణను ఆర్టీఐ ప్రచార కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బెజ్జంకి మండలం కల్లేపల్లి శివారులోని గూడెం గ్రామపంచాయతీ పరిధిలో 63 ఎకరాల 18 గుంటల భూమి సమస్యను పరిష్కరించి, ఎన్నికల హామీని నెరవేర్చిన సందర్భంగా ఈ సన్మానం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీఐ ప్రచార కమిటీ ఫౌండర్, చైర్మన్ రాచూరి మల్లికార్జున్, మాజీ ప్యాక్స్ చైర్మన్ మరియు కెడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి కలిసి ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమానికి దళిత సంఘాల నాయకులు, లబ్ధిదారులు హాజరయ్యారు. గూడెం గ్రామంలో గతంలో నిరుపేద దళిత కుటుంబాలకు కేటాయించిన భూములకు సంబంధించిన సర్వే, మ్యూటేషన్ ప్రక్రియలు ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉండగా, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జోక్యంతో అవి పూర్తి అయ్యాయి. దీంతో 35 మంది లబ్ధిదారులు అధికారికంగా పట్టాదారులుగా మారారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇచ్చిన హామీని నిలబెట్టుకుని దళితులకు న్యాయం చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. భూములకు విద్యుత్ సదుపాయం, వ్యవసాయ బావుల ఏర్పాటుకు కూడా సహకరించాలని కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇతర భూ సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సముద్రాల లక్ష్మణ్, రెడ్డిగాని రాజు, మామిడి అనిల్, మీసాల అంజయ్య, బోయిని కొమురయ్య, ఎలుక రాజు, మాతంగి లక్ష్మణ్, కన్నం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# హోమియోపతి వైద్య విధానంలో భారత్ అగ్రస్థానం: మేయర్ కొలగాని శ్రీనివాస్




కరీంనగర్, ఏప్రిల్ 11: హోమియోపతి వైద్య విధానంలో భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచిందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో హోమియోపతి అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం, డాక్టర్ సామ్యూల్ హానిమాన్ 271వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై, హానిమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హోమియోపతి వైద్యులు మేయర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హోమియోపతి వైద్యం అన్ని రకాల వ్యాధులకు అందుబాటులో ఉండే సురక్షితమైన విధానమని తెలిపారు. ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా చికిత్స అందించే ఈ విధానానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయడంలో హోమియోపతి ముఖ్యపాత్ర పోషిస్తోందని చెప్పారు. హోమియోపతి పితామహుడు డాక్టర్ సామ్యూల్ హానిమాన్ చేసిన పరిశోధనలు వైద్యరంగానికి ఎంతో మేలు చేశాయని కొనియాడారు. హోమియోపతి వైద్య రంగంలో సేవలందిస్తున్న వైద్యులకు ప్రపంచ హోమియోపతి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హోమియోపతి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కొడిత్యాల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎన్.ఎస్. రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ అఫ్సానా, పలువురు హోమియోపతి వైద్యులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

### విద్యారణ్యపురిలో సీసీ రోడ్డు భూమి పూజ



కరీంనగర్, ఏప్రిల్ 11: కరీంనగర్ నగర అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పలు పనులకు శ్రీకారం చుట్టారు. నగరంలోని 3వ డివిజన్ విద్యారణ్యపురిలో సీసీ రోడ్డు నిర్మాణానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సాదవేణి లావణ్య మునీందర్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి రూ.8.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు మేయర్ ఆదేశించారు. సీసీ రోడ్డు పనుల ప్రారంభంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మేయర్‌ను శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగర సమగ్ర అభివృద్ధే తమ పాలకవర్గ ధ్యేయమని పేర్కొన్నారు. విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల డివిజన్లకు ప్రాధాన్యతనిస్తూ నగరంతో సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. నగర వ్యాప్తంగా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. నగర ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, చేపట్టిన పనులను గడువులోగా నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కరీంనగర్‌ను అన్ని రంగాల్లో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గాజ రమ శివరాం, ఈఈ శివానందం, ఏఈ గఫూర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో భారీ జీతాల కుంభకోణం బహిర్గతం

కరీంనగర్, ఏప్రిల్ 10: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన భారీ జీతాల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. మరణించిన కానిస్టేబుళ్ల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి సుమారు రూ.1.40 కోట్ల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనపై ఏసీపీ (టాస్క్ ఫోర్స్) వాసాల సతీష్ ఫిర్యాదు మేరకు కరీంనగర్ I-టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం, పోలీస్ కమిషనరేట్ సీపీవో కార్యాలయంలో పే సెక్షన్‌లో గతంలో పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ నీలం రామ్మోహన్, ప్రస్తుతం చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో మరణించిన ముగ్గురు కానిస్టేబుళ్ల ఉద్యోగ వివరాలను వినియోగించి, ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో బ్యాంకుల్లో నకిలీ ఖాతాలు తెరిచి జూన్ 2022 నుంచి మార్చి 2026 వరకు జీతాలు జమ అయ్యేలా అక్రమాలకు పాల్పడ్డాడు. నకిలీ ఖాతాల్లో జమ అయిన డబ్బును ఏటీఎంల ద్వారా డ్రా చేయడంతో పాటు తన వ్యక్తిగత ఖాతాలకు బదిలీ చేసుకున్నట్లు గుర్తించారు. ఈ ఖాతాలపై లోన్లు తీసుకుని, ఈఎంఐలు కూడా ప్రభుత్వ నిధుల నుంచే చెల్లించేలా పన్నాగం పన్నినట్లు విచారణలో బయటపడింది. ఈ కేసులో నీలం రామ్మోహన్‌తో పాటు రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వై.వి. మునిరామయ్య, మరియు ప్రైవేట్ వ్యక్తులు లావుడియా రవి, చుక్కా గంగరాజు, శంకర్ నామతాబాబ్‌లు సహకరించినట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలను గమనించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ అధికారులు విచారణ చేపట్టి కుంభకోణాన్ని వెలికితీశారు. ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించిన ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 341 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం లేదా అవినీతి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్‌కి కఠిన శిక్ష: 6 ఏళ్ల జైలు విధించిన పిడిజె కోర్టు



కరీంనగర్, ఏప్రిల్ 10: మద్యం మత్తులో అతివేగంగా వాహనం నడిపి ఒక మహిళ మృతికి కారణమైన నిందితుడికి కరీంనగర్ పిడిజె కోర్టు 6 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6,500 జరిమానా విధిస్తూ కీలక తీర్పు వెలువరించింది. 2021 ఫిబ్రవరి 18న రాత్రి చొప్పదండి పరిధిలోని చెక్కల లచ్చయ్య సా మిల్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. నిందితుడు వోడ్నాల నవీన్ కుమార్ మద్యం మత్తులో కారును అతివేగంగా నడుపుతూ ఎదురుగా వచ్చిన ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వడ్లూరి లక్ష్మి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. మరికొందరు ప్రయాణికులు కూడా గాయపడ్డారు. ఈ ఘటనపై బాధితురాలి కుమారుడు వడ్లూరి కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చొప్పదండి పోలీసులు సెక్షన్ 304-II ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 6 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్యాల ప్రతాప్ వాదనలు వినిపించి శిక్ష పడేలా కృషి చేశారు. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించిన కోర్ట్ మానిటర్ సెక్షన్ ఏఎస్సై సత్తయ్య, కోర్ట్ డ్యూటీ కానిస్టేబుల్ శ్రీధర్‌లను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే కఠిన శిక్షలు తప్పవని ఈ తీర్పు ద్వారా పోలీసులు హెచ్చరించారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com